ఆంధ్రజ్యోతి Hyderabad హైదరాబాద్

# నా భార్య ఎంత బాగా డ్యాన్స్ చేస్తుందో

## అల్లు అర్జున్



'నా భార్య స్నేహ మంచి డ్యాన్సర్. ఆమెలోని డ్యాన్సింగ్ ప్రతిభ 'సంగీత్' కార్యక్రమం రోజే బాగా తెలిసింది. ఆ కార్యక్రమానికి హాజరైన నితిన్ ఆమె నృత్యాన్ని చూసి.. నీకు తగ్గ భార్య దొరికింది. మేడ్ ఫర్ ఈచ్ అదర్.. అని కాంప్లిమెంట్ చేశాడంటే.. ఎంత బాగా డ్యాన్స్ చేసిందో..' అని మురిసిపోతూ చెప్పారు స్టైలిష్‌స్టార్ అల్లు అర్జున్. శీతల పానీయాల సంస్థ 7 అప్ ప్రారంభించిన 7 అప్ స్టార్ విత్ అల్లు సీజన్-2 ప్రారంభం అయిందని చెప్పటానికి నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అల్లు అర్జున్ ప్రత్యేకంగా హాజరయ్యారు. '7 అప్ స్టార్ విత్ అల్లు - సీజన్ 1'కు అనూహ్యమైన స్పందన వచ్చిందని, అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా 7గురు డ్యాన్సర్లను ఎంచుకుని ఓ వీడియో ఆల్బమ్ చేయటం జరిగిందని అల్లు అర్జున్ అన్నారు. ఆ కార్యక్రమం ఇచ్చిన స్ఫూర్తితోనే సీజన్-2 కు ఇప్పుడు శ్రీకారం చుట్టడం జరిగిందని చెబుతూ 'నా అభిమానులతో మరింత దగ్గరగా సంభాషించటానికి.. నా గురించి నేను తెలుసుకోవటానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ క్రమంలోనే తొలి సీజన్‌లో ఆర్య-2 చిత్రంలోని ఓ గీతానికి వీడియో ఆల్బమ్ చేయటం జరిగింది. సీజన్-2 కోసం ఇప్పటి వరకూ ఏ గీతమూ ఎంపిక చేయలేదన్నా'రు.

తాను చేస్తోన్న సినిమాల గురించి మాట్లాడుతూ 'త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నాను. ఇంకా ఆ సినిమాకు పేరేమీ అనుకోలేదు. ప్రస్తుతానికి నేను చేయబోతున్న సినిమా ఇది ఒకటే..' అనిఅన్నారు.

వివాహం తరువాత జీవితం ఎలా ఉందన్న ప్రశ్నకు స్పందిస్తూ... ' పెళ్లి కాకముందు ఓపెన్ చేయని 7 అప్ కాన్‌లా ఉండేది. ఇప్పుడు ఓపెన్ చేసిన కాన్‌లా ఉంది జీవితం...' అంటూ తన చేతిలోని 7 అప్ కాన్‌ను చూపిస్తూ నవ్వేశారు.

తన నుంచి ఎక్కువ మంది డ్యాన్స్‌లను ఆశిస్తున్నారని చెబుతూ త్వరలో చేయబోయే చిత్రం కోసం 2-3 కొత్త శైలుల్ని ఎంపిక చేసుకున్నాం. తప్పకుండా ఆ స్టెప్‌లు అభిమానులను ఆకట్టుకుంటాయి అని అన్నారు.

నృత్య ప్రధానంగా ఓ సినిమా చేయాలనే కోరిక తనకు ఉందని చెబుతూనే ఆ కోరిక తీరటానికి మరికొంత సమయం పడుతుందన్నారు. చరణ్‌తో చేయబోయే చిత్రానికి కూడా అంతే సమయం పడుతుంది అని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

పెప్సికో ఇండియా ఫ్లేవర్స్ మార్కెటింగ్ (బేవరేజస్) వైస్ ప్రెసిడెంట్ రుచిర జైట్లీ మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్‌లోని 8 నగరాలతో పాటుగా బెంగళూరులో కూడా ఈ సారి ఆడిషన్స్ జరుపనున్నాం. హైదరాబాద్‌లో అక్టోబర్ 30, నవంబర్ 20 తేదీలలో ఆడిషన్స్ జరుపటంతో పాటు నవంబర్ 23న ఫైనల్స్ కూడా నిర్వహించనున్నాం..' అని అన్నారు.



-సిటీలైఫ్ ప్రతినిధి



© Andhra Jyothi - Hyderabad Andhra Jyothi www.andhrajyothy.com